



**5**

## గత సంచికనుంచి కొనసాగింపు

**జరిగిన జగన్నాటకం**

**సవ్యలంకలో కళ్ళు తెరిచిన బోస్ ఎడమచేతితో మంచినీళ్ళు ఇవ్వబోయిన నందుకి అది తప్పు అని చెప్పి భంగపడ్డాడు. గుళ్ళో కుడి చేత్తో ప్రసాదం తిన్నందుకు అతణ్ణి బంధించి మరణదండన విధించబోతే, ఆచార్య వేదాంతం, ద్వీప, నందు తండ్రి పశుపాల కలిసి బోస్ ని కాపాడారు. చట్ట వ్యతిరేకంగా ఆ ద్వీపాన్ని వదిలిపోయేందుకు సహాయం చేసే జలపతిని కలవాలని నిర్ణయించుకున్నాడు బోస్.**

మహాప్రళయానికి ముందుమాటలా భోరుమంటూ వర్షం. మృత్యుసమాచారం మోసుకొస్తున్న నక్క ఊళల్లా జోరుగాలి గోల చేస్తోంది. ఫెళఫెళా విరిగిపడుతున్న చెట్ల చప్పుడు కఠోరమైన ఉరుముల శబ్దంలో అణిగిపోతోంది. అప్పటికే చీకటి అజ్ఞానంలా ఆక్రమించేసింది. ఒంటరిగా వున్నాడు బోసు. గడప దాటి బయటకు వేళ్ళే అవకాశం లేదు. తనకి ఇక్కడ ఆశ్రయం ఇచ్చారా లేక బంధించారా అని ఒక్క క్షణం అనుమానం వచ్చింది. నిద్రపోదామని విశ్వప్రయత్నం చేశాడు. అసహనంగా అటూ ఇటూ దొర్లాడు. సరిగ్గా నిద్రపట్టి ఒక్క క్షణం కునుకు తీశాడో లేదో దగ్గర్లో ఏదో అలికిడి అయినట్లనిపించి మెలకువ వచ్చింది.

చుట్టూ చూశాడు. పాడుపడ్డ ఇల్లు అని పశుపాల చెప్పాడు కానీ, మరీ అంత పాతదేమీ కాదు. ఆ ఇంట్లో ఎవరూ వుండట్లేదనీ, బోసు అక్కడే వుండచ్చనీ ఆచార్య వేదాంతం చెప్పడంతో పది రోజులుగా అక్కడే వుంటున్నాడు. పశుపాల భోజన సదుపాయాలన్నీ ఏర్పాటు చేస్తే, ద్వీప అప్పుడప్పుడు వచ్చి వసతులన్నీ సరిగా వున్నాయో లేదో చూసుకుంటోంది.

"ఎంత కాలం ఇలా మీకు భారమై వుండమంటారు" అన్నాడు ద్వీపతో ఒకరోజు.

"మీరు చెప్పిన మాటల్లో మూడు తప్పులు దొర్లాయి. మొదటిది మీరు వచ్చి ఎంతో కాలం కూడా కాలేదు. అతిధుల్ని మర్యాదగా చూసుకోవడం మా సంప్రదాయం. అందువల్ల మీరు మాకు భారం ఎన్నటికీ కారు." అంది ద్వీప.

"మరి మూడోది?"

"అది మీరు నన్ను మీరు అని సంబోధించడం. నన్ను పేరు పెట్టి ద్వీప అని పిలవచ్చు మీరు" అంది.

"నన్ను అనవద్దని చెప్పి మీరు అంటున్నారు"

"అదిగో మళ్ళీ అన్నారు..." అని తన తప్పు తెలుసుకుంది ద్వీప. "సరే.. సరే.. ఇక నుంచి అవన్నీ లేకుండా మాట్లాడుకుందాం. సరేనా బో..సు.."

"అలాగే ద్వీ.. ప.." అన్నాడు బోస్ అదే శ్రుతిలో. అప్పటి నుంచి ఇద్దరి మధ్య చనువు పెరుగుతూ వస్తోంది. ఆమె ఎడమ చేతితో ఏది ఇచ్చినా అతను కాదనకుండా కుడి చేత్తో తీసుకుంటున్నాడు. ఆమెకు కూడా ఆ విషయంలో పెద్దగా పట్టింపు లేనట్లు వ్యవహరిస్తోంది. ద్వీప గుర్తుకురాగానే బోస్ పెదవుల మీద అప్రయత్నంగా చిరునవ్వు వచ్చింది.

'తను ఎవరో, ఎక్కడివాడో తనకే తెలియదు. ఎట్టి పరిస్థితుల్లో ఈ ద్వీపంలో వుండకూడదనీ, సింధూర దేశానికి ఎప్పుడు అవకాశం వస్తే అప్పుడు వెళ్ళిపోవాలని అనుకుంటున్నాడు. ఇక్కడ వుండేదంతా మూణ్ణాళ్ల ముచ్చటే. ఆ విషయం ద్వీపకి కూడా తెలుసు. అయినా ఆమె ఎందుకు అలా వ్యవహరిస్తోందో అర్థం కావటంలేదు. ఏదో తెలియని ఒక కొత్త ప్రాంతం నుంచి వచ్చాడు కాబట్టి, తన వివరాలు తెలుసుకోవాలన్న కుతూహలమా? కేవలం గతం మరచిపోయి వున్నాడన్న కారణంగా పుట్టిన జాలి వల్ల కావచ్చా? ఇవేవీ కాక ఇంకేదైనా అనుబంధాన్ని పెనవేయాలని చూస్తోందా? ఏమీ అర్థం కావటం లేదు బోసుకి. ఏమైనా ఆ అమ్మాయితో ఎక్కువ చనువుగా వుండకూడదు అనుకున్నాడు.

మళ్ళీ అలికిడి అయ్యింది. ఈ సారి ఇంటి గుమ్మానికి దగ్గరగా ఎవరో నడుస్తున్నట్లు అనిపించింది. బయట కురుస్తున్న జోరు వాన, హోరు గాలి చప్పుళ్లలో ఈ అలికిడి అస్పష్టంగా వుంది. అయినా ఖచ్చితంగా విన్న నమకం అతని మనసులో కదిలింది. చటుక్కున లేచి మంచం మీద కూర్చున్నాడు. అందుబాటులో వున్న ఒక కర్ర తీసుకోని చప్పుడు వచ్చిన వైపు కదిలాడు. ఎవరో ఇంట్లోకే వస్తున్నట్లు అనిపించింది.

ఇప్పటి వరకు అతనుంటున్న ఇంట్లోకి వచ్చిన వాళ్ళు ఇద్దరే. ఒకరు ద్వీప, మరొకరు పశుపాల. ఇంత రాత్రిపూట, అదీ ఇంత వర్షంలో ద్వీప రాదు. పశుపాల కొన్ని గంటల ముందే వెళ్ళాడు కాబట్టి అతను అయ్యే అవకాశం లేదు. మరి ఇప్పుడు ఇంట్లోకి వస్తున్నదెవరు? బోసు మనసులో వున్న అనుమానం క్రమంగా భయంగా మారసాగింది.

గుళ్ళో కుడిచేత్తో ప్రసాదం తిన్నందుకు దళాధిపతి దాదాపు చంపేసినంత పని చేశాడు. అతను విధించిన శిక్ష తప్పించుకున్నందుకు అతనికి ఇంకా కోపంగానే వుంది. "నీ అంతు చూస్తానని" బెదిరించిన దళపతి ముఖం కళ్ళముందు కనపడింది. ఇంత రాత్రి వేళ అతనే గనక వస్తే తన మరణం ఖాయమని బోసుకి తెలుసు. అతని చేతిలో వున్న కర్ర పోరాడటానికి కానీ, కనీసం అవతలి వ్యక్తిని భయపెట్టడానికి కానీ పనికిరాదని కూడా తెలుసు. ఆ ఇంట్లో ఇంకేమైన ఆయుధం దొరుకుతుందేమోనని వెతకసాగాడు. సరిగ్గా మరో నిముషానికి ఎవరో తలుపు కొట్టిన చప్పుడు అయ్యింది. తలుపు తీయాలా వద్దా అన్న నిర్ణయం తీసుకునే లోపల మళ్ళీ తలుపు కొట్టిన చప్పుడు వినిపించింది. ఈ సారి

గట్టిగా, ఖంగారుగా కొట్టినట్లు అనిపించింది. తప్పదన్నట్లు తలుపు దగ్గరకు వెళ్ళి కుడిచేతిలో కర్రని మరింత గట్టిగా పట్టుకోని, ఎడమచేత్తో తలుపు తెరిచాడు.

తలుపు తెరుచుకున్న మరుక్షణం ఎవరిదో ఆకారం లోపలకి దూకి అతన్ని పక్కకు తోసి, వెంటనే తలుపు మళ్ళీ వేసేసింది.

"ఎవరు? ఎవరది?" అన్నాడు బోసు.

"బాబూ, నేను" అన్నాడతను. అతను పశుపాల.

"పశుపాల? నువ్వా? ఏమిటీ ఇంత రాత్రివేళ?"

"ఏం మాట్లాడకండి. వెంటనే మీ సామాన్లు సర్దుకోని కదలండి. వెళ్ళిపోదాం." అన్నాడు

"ఇప్పుడా? ఎక్కడికి?" బోస్ ఆశ్చర్యపోయాడు.

"జలపతి దగ్గరకి"

"బయట తుఫాను..." బోసు వాక్యం పూర్తికాక ముందే పశుపాల అందుకున్నాడు.

"అందుకే. ఇదే మంచి సమయం. చెప్పాను కదా, జలపతి సంఘబహిష్కరణ శిక్ష అనుభవిస్తున్నాడు. సముద్రపు ఒడ్డున ఒక పాక వేసుకోని అందులో వుంటున్నాడు. అతని దగ్గరకు వెళ్ళాలంటే సరిహద్దు పరిరక్షక దళాన్ని తప్పించుకోని వెళ్ళాలి. విషయం తెలిస్తే మనల్ని ప్రాణాలతో బ్రతకనివ్వరు. ఈ తుఫానులో ఎక్కువమంది వుండరు. పైగా దక్షిణ భాగంలో తుఫాను బీభత్సం ఎక్కువగా వుందని, పరిరక్షక దళంలో చాలామందిని అక్కడకు పంపించారు. ఇంత కన్నా మంచి సమయం దొరకదు. పదండి వెళ్దాం.."

"ఒకసారి ఆచార్య వేదాంతాన్ని అడిగి నిర్ణయం తీసుకుంటే..."

"ఇది వేదాంతంగారి ఆజ్ఞ... ఆయన చెప్తేనే ఇక్కడికి వచ్చాను."

బోసుకు ఏం చెప్పాలో అర్థం కాలేదు. ఒకసారి ద్వీపకు చెప్పడం మంచిదని అనిపించింది కానీ అది సాధ్యపడేలా లేదు. ఇలాంటి అవకాశం మళ్ళీ మళ్ళీ రాదు. ద్వీపని కలవటమా? ఈ ద్వీపాన్ని వదిలిపెట్టడమా? రెండు క్షణాలపాటు అదే ఆలోచన అతన్ని కమ్మేసింది.

"ఏమిటి ఆలోచిస్తున్నారు? పదండి" పశుపాల తొందరపెట్టడంతో బోసు తలాడించి ముందుకు కదిలాడు.

ఇద్దరూ ఆ ఇంట్లో నుంచి బయటికి వచ్చి తూర్పు దిశగా సాగిపోయారు. అప్పటి దాకా వాళ్ళిద్దరినే గమనిస్తున్న వ్యక్తి చీకట్లో నుంచి బయటికి వచ్చి పడమటి వైపు వడి వడిగా అడుగులు వేస్తూ మళ్ళీ చీకట్లో కలిసిపోయాడు.

★★★

ఆచార్య వేదాంతం తలుపు తెరిచాడు. ఎదురుగా ద్వీప.

"ఏంటమ్మా ఇంత రాత్రిపూట వచ్చావు?" అడిగాడు ఖంగారు. అప్పటికే ఆమె పూర్తిగా తడిసిపోయి వుంది.

"ఏం లేదు ఆచార్యా. బోస్ దగ్గరకు వెళ్దామని బయల్దేరాను. దారిలో వర్షం మొదలైంది. కొద్దిసేపు గుళ్లో వున్నాను. తెరిపినిచ్చేసరికే చీకటి పడింది. వెనక్కి వెళుతుంటే మళ్ళీ మొదలైంది. మీ ఇంటికి దగ్గర్లో వున్నానని ఇటు వచ్చాను" అంది ద్వీప వేదాంతం ఇస్తున్న పొడి గుడ్డని అందుకుంటూ.

ఆమె తల తుడుచుకుంటుంటే వేదాంతం కిటికీ దగ్గరకు నడిచి బయటికి చూశాడు. ఆ ఊరిని పూర్తిగా ముంచేసేదాకా ఆగనన్నట్లు భారీగా వర్షం కురుస్తోంది. ఆకాశంలో దట్టంగా వున్న మబ్బులు మెరుపు వచ్చినప్పుడల్లా ఏదో సందేశాన్ని భూమి మీదకు పంపుతున్నట్లున్నాయి.

"ఏదో ప్రళయం వచ్చేలా వుంది" అన్నాడాయన.

ద్వీప ఒక్కసారి ఉలిక్కిపడి అతని వైపు చూసింది. మరుక్షణం ఆమె చేతిలో వున్న గుడ్డ జారిపడిపోయింది. ఏదో అర్థం చేసుకుంటున్నట్లు స్థాణువులా నిలబడిపోయింది.

"నేను ఇప్పుడే వస్తాను" అంటూ వెనక్కి తిరిగింది.

"అతనక్కడ వుండడు" అన్నాడు వేదాంతం.

"ఎందుకని? ఏమైంది బోసుకి?" అడిగింది ఖంగారుగా.

"అతనికి ఇక్కడ వుండాలని ఏ మాత్రం లేదు. జలపతిని కలిసి ఎలాగైనా ఇక్కడ్నుంచి వేరే చోటికి వెళ్ళిపోవాలని పదే పదే అడుగుతున్నాడు. ఈ రాత్రికే అతన్ని సరిహద్దు దాటించమని పశుపాలకి చెప్పాను. ఈ పాటికి బయల్దేరివుంటారు" అన్నాడాయన గది మధ్యలో వున్న కుర్చీలో కూర్చుంటూ. ద్వీప ఏదో మత్తులో వున్నట్లు ముందుకు నడిచి అతని ముందు కూర్చుంది. కొద్దిసేపు ఇద్దరూ ఏమీ మాట్లాడుకోలేదు.

"ఈ ప్రళయానికీ, బోసు ఇక్కడికి రావటానికి సంబంధం వుందంటారా?" అంది నెమ్మదిగా.

వేదాంతం ఆమె వైపు చూసి చిన్నగా నవ్వాడు. "ప్రకృతి వైపరీత్యాలకీ మనుషులకీ సంబంధం ఎందుకుంటుందమ్మా? ప్రజా వినాశనం ఏ దేవుడూ కోరుకోడు. కానీ మూఢంగా నమ్మేవాళ్ళకి ఈ రెండింటికి సంబంధం కనబడుతుంది. నమ్మనివాళ్ళకి ఈ రెండూ రెండు సంఘటనలు. ఈ ఇద్దరితో ప్రమాదం లేదు. నమ్మినా నమ్మకపోయినా, కేవలం ఆ నమ్మకాన్ని నిలబెట్టాలనుకునే వాళ్ళు మాత్రం అతని వల్లే ఈ ప్రళయం వచ్చిందని ప్రచారం చేస్తారు."

"అంటే బోసు..."

"అతని ప్రాణాలను కాపాడటం ఇప్పుడు ఎవరి వల్లా కాదు. ప్రభుత్వం కాకపోయినా ప్రజలందరూ కలిసి అతన్ని చంపేస్తారు." ఆందోళనగా అంటూ నిట్టూర్చాడు వేదాంతం.

ఆమె కళ్ళలో నీళ్ళు తిరగటం ఉన్న కాస్త వెలుగులో కూడా స్పష్టంగా కనిపించింది ఆచార్య వేదాంతానికి.

"అతని గురించి మరీ అంతగా ఆందోళన చెందకు. అతను పరదేశి. ఈ రోజు వుంటాడు రేపు వెళ్ళిపోతాడు" చెప్పాడతను అనూనయంగా.

"అతను ఎక్కడికీ వెళ్ళడు" అందామె స్థిరంగా.

"వెళ్ళాలని చాలా పట్టుదలతో వున్నాడు. ఈ వారం రోజుల్లో కనీసం పదిసార్లు ఆ మాటే అన్నాడు. అయినా అతను వెళ్ళడని నీకెందుకు అనిపిస్తోంది?" అడిగాడాయన.

"ఎందుకంటే నేను మహాజ్ఞానం గ్రంధాన్ని క్షుణ్ణంగా చదివాను. అందులో ప్రతిపాదించిన లక్షణాలన్నీ బోసులో వున్నాయి. మహాబసు అన్న పేరు మీకు గుర్తుందా?"

"మహాబసు, బోసు ఒకరేనని నీకనిపిస్తోందా?"

"అవును. మన దేశంలో మనకే తెలియకుండా జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించి పోరాడబోయే వీరుడు మహాబసు, ఈ బోసేనని నా నమ్మకం."

"నువ్వు చెప్పేది కూడా నిజం కావచ్చు" అన్నాడాయన సాలోచనగా.

"మరి అయితే బోసు ఈ ద్వీపాన్ని దాటి వెళ్ళకుండా చూడాలి. ఎలాగైనా అతన్ని ఒప్పించి ఇక్కడే వుండేలా..." చెప్తున్నదల్లా వేదాంతం ముఖంలో చిరునవ్వు చూసి ఆగిపోయింది.

"పిచ్చిదానా. మనం ఆపితే ఆగేవాడు మహాబసు ఎలా అవుతాడు? జరగబోయేది ఎప్పుడో నిర్ధారితమైపోయి వుంటుంది. ఒకవేళ నిజంగా బోసే మహాబసు అయితే అతను ఎక్కడికీ వెళ్ళలేడు."

"కానీ అతన్ని మీరు పంపించేశారు కదా?"

"నేను పంపించడమేమిటి? అతనే వెళ్ళాలనుకున్నాడు. కానీ మనం అనుకున్నదే నిజం అయితే అతన్ని వెళ్ళనివ్వకుండా ఏదో ఒక శక్తి ఆపేస్తుంది. అలా ఆగి అతను తిరిగి వస్తే నువ్వు చెప్పింది నిజమేనని నేను నమ్ముతాను. చూద్దాం ఏం జరుగుతుందో" అంటూ లేచి వెళ్ళి కిటికీలో నుంచి పడుతున్న వర్షాన్ని చూస్తూ నిలబడ్డాడు. దూరంగా ఎక్కడో పెద్ద పిడుగుపడ్డ చప్పుడు భూమి దద్దరిల్లేలా వినిపడింది. ద్వీప అదిరిపడింది.

★★★

అప్పటికి ఓ గంటకు పైగా నడిచి వుంటారు ఇద్దరూ. జోరుగా పడుతున్న వర్షం వాళ్ళకు దారి కూడా కనపడనివ్వకుండా చేస్తోంది. నడుము లోతు నీళ్ళు అడుగులు పడనివ్వటంలేదు. ఆ వర్షపునీటిలో కొట్టుకొస్తున్న చెట్టు చేమ రాసుకుంటూ వెళుతున్నాయి. వాటిని అప్రమత్తతతో గమనించకపోతే అవి వాటితోపాటు లాక్కెళ్ళిపోయాలా వుంది పరిస్థితి. అంత శ్రమలోనూ బోసు ఉత్సాహంగా కదులుతున్నాడు అతన్ని అందుకోవడం పశుపాలకి కష్టంగానే వుంది. మరో పది నిముషాలు నడిచాక నీటి లోతు తగ్గడం మొదలైంది. క్రమంగా ఎత్తైన ప్రదేశానికి చేరుకుంటున్నామని అర్థం చేసుకున్నాడు బోసు.

తల పైకెత్తి చూశాడు. నల్లటి మబ్బులు పూర్తిగా ఆక్రమించేసి వున్నాయి. మెరుపుల వెలుగులో ఆ మబ్బుల్లో ఏదో ఆకారం కనపడినట్లు అనిపించింది. ఒక్కసారి ఆగిపోయాడు. మళ్ళీ మెరుపు కోసం ఎదురుచూస్తూ అదే మబ్బు వైపు చూస్తూ వుండిపోయాడు. మరో మెరుపు మెరిసింది. సుభాష్ చంద్ర బోస్... నవ్వుతున్నాడు. హేళనగా... ఎద్దేవా చేస్తున్నట్లు... వెక్కిరింపుగా..!!

"త్వరగా రండి..." అరిచాడు పశుపాల. అప్పటికే అతను ఓ పదడుగులు ముందు వున్నాడు.

తేరుకున్న బోస్ అతని వైపు చూశాడు. అతని ముందు వున్న ఇనుప తీగలు తళుక్కున మెరిసాయి. వెంటనే అక్కడికి పరుగుతీశాడు.

"ఏంటివి?" అడిగాడు

"ఇదే సరిహద్దు. మనం ఒంటిగుట్ట మీద వున్నాము. ఈ తీగల్ని దాటితే ఈ ద్వీపాన్ని దాటినట్లే. ఎదురుగా కనిపిస్తున్నదే సముద్రం" అన్నాడు ఆ తీగల కింద నుంచి దూరుతూ. బోస్ తల ఎత్తి చూశాడు. నాలుకలు చేపిన మహాసర్పంలా ముందుకు ఉరుకుతోంది ఆ సముద్రం. బోస్ మనసు ఉత్సాహంతో ఉరకలేసింది. అతను కూడా పశుపాలలాగే కుడి చేత్తో తీగని పట్టుకోని కింద నుంచి దూరబోయాడు.

సరిగ్గా అప్పుడు జరిగిందది –

ఆకాశంలో ఉరుములు ఫెళ ఫెళ మని చప్పుడు చేస్తుండగా, ఈ మబ్బుల రాపిడిలో పుట్టిన ఒక మెరుపు కాలుతున్న నక్షత్రంలా ఆకాశాన్ని నిలువునా చీల్చేస్తూ వచ్చి ఒంటి గుట్ట మీద వున్న ఇనపతీగలపైన వాలింది.

ఎగిరి పడ్డాడు బోసు..!!

పశుపాల పరుగుపెడుతూ అక్కడికి వెళ్ళాడు. ప్రాణం పోలేదని మాత్రం అర్థం అయ్యింది కానీ స్పృహలేదు.

అదే సమయంలో ఆ అలికిడి విన్న ఓ సరిహద్దు పరిరక్షక దళం సైనికుడు చుట్టూ పరికించి చూశాడు. దూరంగా ఒక మనిషి పడి వుండటం, అతన్ని లేపాలని మరో వ్యక్తి ప్రయత్నించడం కనిపించింది. చప్పుడు చెయ్యకుండా అతని వైపే నడుస్తూ వాళ్ళు ఎవరై వుంటారా అని గమనించసాగాడు. మరో మూడడుగుల దూరంలో వాళ్ళు ఉన్నప్పుడు కింద పడివున్న వ్యక్తిని గుర్తించాడు.

"కుడి చేతిని వాడేవాడు. అవును, వాడే వీడు" అనుకున్నాడు. మరుక్షణం అతని ఎడమ చెయ్యి కత్తి పిడి మీద బిగుసుకుంది. దళాధిపతి తనని మెచ్చుకుంటున్నట్లు కళ్ళముందు కనపడింది. ముఖం మీద పడుతున్న చినుకుల్ని కుడి చెత్తో తుడుచుకోని చిరునవ్వు నవ్వాడు. మరో రెండడుగులు వేశాడు.

పశుపాల అటువైపు తిరిగివున్నాడు. అతని ధ్యాస అంతా బోసుని ఎలాగైనా దక్కించుకోవాలనే వుంది. అందువల్ల వెనకే నిల్చున్న మృత్యువుని అతను గమనించలేదు.

ఒక్క క్షణం ఆలోచిస్తూ నిలబడ్డాడు సైనికుడు. చంపాల్సిన వ్యక్తి స్పృహలో లేడు. అడ్డంగా వున్న మనిషిని పక్కకు తోసి, మరుక్షణం కత్తిని మరో మనిషి గుండెల్లో దింపాలని అనుకున్నాడు. కత్తిని బయటికి తీసి ఎడమ చేతి పిడికిలితో పిడిని బలంగా పట్టుకున్నాడు. కుడిచేతిని పశుపాల తలపై వేసి విసురుగా అతన్ని విసిరేశాడు. మరుక్షణం కత్తిని పైకెత్తాడు.

ఏం జరిగిందో అర్థం అయ్యేలోగా నాలుగైదు అడుగుల అవతల పడ్డాడు పశుపాల. తోసిందెవరో తెలుసుకోని, బోసు మీదకు పైకి లేస్తున్న కత్తిని నోట మాట రాక చూస్తూ వుండిపోయాడు. కానీ పైకి లేచిన కత్తి కిందకు దిగలేదు. అసలు ఆ సైనికుడు కదలటంలేదు. కారణం అర్థం కాక అతని ముఖంలోకి చూశాడు. సైనికుడు ముఖంలో ఒక నమ్మలేని అద్భుతాన్ని చూస్తున్నట్లు ఆశ్చర్యం కనపడింది. కారణం అర్థం చేసుకోడానికి సైనికుడికి ఎదురుగా ఏం జరుగుతోందో చూశాడు.

అప్రయత్నంగా పశుపాల పెట్టిన కేక ఆ ప్రాంతమంతా ప్రతిధ్వనించింది.

సముద్రంలో పైకి లేచిన అల!! దాదాపు పదిహేను, ఇరవై అడుగుల ఎత్తైన అల.... తెల్లటి నురగలు కక్కుతూ, అడ్డు వచ్చినది ఏదైనా అవశేషంలా మిగిల్చేసే వేగంతో దూసుకువస్తోంది!!

★★★

**(జరగబోయే జగన్నాటకం వచ్చే మాసం)**

COMMENTS